


గుర్నాధం లోపలికెళ్ళి దీపం వెలిగించి వచ్చేవరకూ మాటలు వినిపిస్తున్నాయి సావిట్లోకి. నరసయ్య మహా ఉత్సాహంగా, హడావుడిగా మాట్లాడుతున్నాడు.

నాయుడుగారూ మీదాకా వచ్చిందీ! ఘంట కితం కరణంగారింట దస్తుదస్తంతా క్రిష్ణార్పణం అయిపోను..... ఎవడో నల్లటాడు కోరమీసాలూ జులపాలూ వాడూ జీబూతంలా ఉన్నాడు....కాకపోయినా అంత ఇదయితే ఎలాగండీ. ఎంత కరణవేనా ఇంట్లో అలా వేలకి వేలు దస్తు అట్టిపెట్టుకుంటే ఎలా? ఎప్పటేదప్పుడు పైకి పంపించెయ్యాలిగాని ( ఎంతయ్యా పోయిందీ అంటున్నారు మునసబుగారు) ఆ ఇదంతా పరపతి కోసంలే. పదీ పరకా సర్ది మునసబంత వాడనిపించుకోవాలని తాపత్రయం. అది సరే గాని మాటవరస కడుగుతా మీరు ఇన్నాళ్లు మునసబుగిరీ చేశారు. మంచాయె చెడ్డాయె రొఖ్ఖం అలా ఇంటో ఎక్కడపడితే అక్కడ పడేశారండీ.... అహ తెలీకడుగుతున్నా..... ఎంతన్నారు రొండొందలా...... చూశారామరి, అపాటి మగసిరి లేకనే మీరు కొద్ది రొఖ్ఖం అట్టిపెట్టుకోడం? అపాటి పెగ్గె మీకు లేకపోయిందా అంట. ఏవిటో ఎవడిమటుకు వాడు ప్రవేజకున్ననుకుంటాడు వాడితోటే ఆ విద్య పుట్టిందని – ఇదిగో మా వెధవా ఉన్నాడు పెవేజకత్తానికి. తెల్లారి మెయిలుబండికి చెన్నపట్నం వెళ్లితీరాలి చచ్చితీరాలి అని పట్టుబట్టె కూర్చున్నాడు. వెధవాయి. నాకేమో రేపు పున్నమెల్లిన తదియనాటిగ్గాని ఆ కోపరేటివువాళ్లు లోను తగలెయ్యనంటున్నారు – ఆ వందా మీరిటు సర్దితే అది రాగానే ఫిరాయించేదాం. ఏదో ఆ పాటి పదిరూపాయలు చేతబట్టుక్కూచోగల మొగాడేడండీ వూళ్లో. ఎవడిమటుకు వాడికి భయమేనాయె – ఏ నర్సయ్య వచ్చి అప్పాదెమ్మంటాడో – ఏ నర్సయ్యవచ్చి కన్నంవేస్తాడోనని – జవాబు చెప్పే సత్తా లేకనేగదా పెతివాడూ రొక్కం దగ్గర పెట్టుకోంది. మన

కాలం ఇలాంటి జజ్జుతనం ఉండేదండీ- వంద చాలు. పున్నమెళ్ళిన తదియనాడు చంద్రోదయం వేళకల్లా మళ్ళా సర్దెయ్యనూ - పెద్దమనిషితో మాటా మరోటా - అబ్బాయా ఏమిటి -

అబ్బాయి గుర్నాథం దీపం పట్టుకువచ్చాడు.

మునసబుగారు మీసాలను లాలించి, 'గుర్నాథం సందుగు పెట్లో ఓ వంద దెచ్చి నర్సయ్యకివ్వూ. పద్దు పుస్తకం గూడా పట్రా' అన్నాడు గంభీరంగా.

నర్సయ్య గాలిదుమారంలా వచ్చి వెళ్లిపోయాడు.

ఆ ఇందాక చెబుతున్న దేమిట్రా..... అన్నారు మునసబుగారు.

అప్పులడిగే వాళ్లదగ్గిర నువ్వెంత గట్టివాడవో చెబుతున్నావు అన్నాడు గుర్నాథం సావిడివంకచూసి నవ్వుతూ. అటించికూడా సన్నటి నవ్వు వినబడింది.

ఎవరక్కడా-కోడలా. నీక్కూడా నవ్వొచ్చేనే తల్లీ.... చూదాం రేపొద్దున్న నీ మొగుడెంత పెవేజికత్వం చూపిస్తాడో. నాదేముంది, అంతా అయిపోయె. మాకు మాకూ మొహమాటాలుంటాయి. అదీకాక ఈ నర్సయ్యగాడు మహాటక్కరిలే. వస్తూనే ముందు నాదగ్గిర చేకాపుకే రొఖ్ఖం రెండొందలుంటుందని చెప్పించు కున్నడయ్యె, అనక కాదనకుండా..... పరువా మరోటా నువ్వే చెప్పుతల్లీ అన్నాడు మునసబుగారు అంతకు మునుపే పారిపోయిన కోడలు నిల్చున్న చోటువేపు చూస్తూ.

గుర్నాథం సిగ్గుపడ్డాడు నవ్వినందుకు.

ఎలాగేనా నర్సయ్య మంచిముండావాడు, మర్యాదస్తుడు అన్నాడు మునసబుగారు ఓ నిముషం నిశ్శబ్దం మీద బింకంగా.

అవున్నాన్నా ఊళ్లో ఆయనకు వీధివీధినా అప్పులే. మర్యాదస్తుడు కాబట్టి అందరప్పులిచ్చుంటారు. మనకే అరు బస్తాలగింజ, దీంతో కలిపి నాలుగొందల రొక్కం ఇవ్వాలి. పద్దు బుక్కులో చూశాను.

పోన్లెస్తూ. అసలు వాడి మాటతీరుకి, ఆ ఒడుపుకే ఊరికేనే ఇవ్వచ్చు వందాను. దీన్ని జూసైనా ఓ పాఠం నేర్చుకో. వందతో తెమిలిన అప్పుకాస్తా, వెయ్యిదాకా వెళ్లలేదని సంతోషపడి దేవుడి కో దణ్ణం బెట్టుకో.

అన్నట్టూ దేవుడంటే గుర్తొచ్చె- శివాలయంకాడ మా స్నేహితుడు పాపం కూర్చునుంటాడు నాకోసం- ఏం చెప్పనూ? అన్నాడు గుర్నాథం లేచి నిలబడి.

మునసబుగారు ఓ నిముషం ఆలోచించి, పోనీ పైకం పట్టెగెళ్తావా నీ అంతవాడివి నువ్వూను అన్నారు.

కాదులే నాన్నా, రేపటికి వాయిదా వేద్దాం అన్నాడు గుర్నాథం.

ఆఫీసు వీధి తూముపాద కాబూలీవాలాలా సిద్ధమైంది ఒకటో తారీఖు సాయంకాలం, గుర్నాథం ప్రాణానికి. బిక్కమొహం పెట్టె తండ్రి ఎదురుగా కూర్చున్నాడు.

★ ★ ★